ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11.11.24 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.
2. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమైక్యతను, స్నేహభావాన్ని పెంపొందించటమే ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ లక్ష్యం అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
3. రాష్ట్రాభివృద్ధికి కచ్చితమైన ప్రణాళిక రూపొందించడానికే కుల గణన చేపట్టామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.
4. జిన్నింగ్ మిల్లర్లు సమ్మె ప్రకటించిన నేపథ్యంలో పత్తి రైతులు ఇబ్బందులు పడకుండ అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

------------------------------

**CM - Procurement**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అటువంటి వ్యాపారులపై అవసరమైతే అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ESMA) కింద చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనల పై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రైతులు పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడటం, రైతులను గందరగోళానికి గురి చేయటం, వేధించటం లాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

**(PN)**

--------------------------

**Ponnam Prabhakar PC**

ఓట్ల కోసం తమ ప్రభుత్వం కుల గణన సర్వే చేపట్టలేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ రోజు ఆయన వేములవాడలో మీడియాతో మాట్లాడారు. ప్రజల స్థితిగతులు తెలుసుకొని రాష్ట్రాభివృద్ధికి కచ్చితమైన ప్రణాళిక రూపొందించడానికే కుల గణన చేపట్టామని స్పష్టం చేశారు. బ్యాంకు, పాన్ కార్డు వివరాలు అడగడం లేదని, ఇష్టముంటేనే కులం, ఆధార్ వివరాలు వెల్లడించవచ్చని తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కు ప్రతి పౌరుడు సహకరించి తెలంగాణ సమగ్రాభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. గత పదేళ్ల పాలనలో బీసీలకు అడుగడుగున అన్యాయమే జరిగిందని, ప్రజా పాలనలో

అన్ని వర్గాలకు సమ న్యాయం జరగాలనే ఆలోచనలో ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. సర్వేకు వస్తున్న ఎన్యూమనరేటర్ల విధులకు ఆటంకం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

**(PTC-RS)**

-----------------------------

**Kishan reddy**

దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమైక్యతను స్నేహభావాన్నీ పెంపొందించటమే ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ లక్ష్యం అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయం లో జరుగుతున్న రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం విద్యారంగంలో చాలా అభివృద్ధి సాధించిందని.. భారత్ విశ్వగురువుగా మారిందని తెలిపారు. వివిధ రాష్ట్రాల కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను కేంద్ర మంత్రి తిలకించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులలో సమైక్యత భావం, దేశభక్తి పెరుగుతుందని తెలిపారు.

-------------**BYTE**-----------

రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమం దేశ సాంప్రదాయాలను ప్రదర్శించటానికి గొప్ప వేదిక అని కేంద్ర విద్యా శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మన దేశ విశిష్టత అని పేర్కొన్నారు. దేశంలోని 25 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు తమ రాష్ట్రాల్లోని కళారూపాలు అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు.

**(MSL)**

--------------------------

**TPCC Mahesh kumar goud**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే బడుగు బలహీన వర్గాల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఎంతగానో దోహదపడుతుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులగణన ఆధారంగా జనాభా ప్రతిపధికన రిజర్వేషన్లు అమలు జరిపి, సామాజిక న్యాయాన్ని సంపూర్ణాంగా వర్తింప చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు కూడా తమ వంతు కృషి కొనసాగించాలన్నారు. అన్ని వర్గాల అభిప్రయాలను స్వీకరించిన తర్వాతనే ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే జరిపిస్తుందన్నారు.

**(PN)**

------------------------

**Srinivas yadav ( MLA)**

రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే సాకుతో కాలయాపన చేస్తూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ నియోజక వర్గం బన్సీలాల్ పేటలో ఆయన ఈ రోజు పర్యటించారు. కుల గణన సర్వేలో 75 ప్రశ్నలు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం

సమగ్ర కుటుంబ సర్వేను ఒక్కరోజులోనే పూర్తి చేసిందని గుర్తు చేశారు. ప్రజల నుండి వచ్చే వ్యతిరేకత తో సర్వే కు వెళ్ళే ఎన్యుమరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారరని అన్నారు.

**(DESK)**

----------------------------

**Thummala Nageshwara rao**

తెలంగాణలో పత్తి జిన్నింగ్ మిల్లర్లు సమ్మె ప్రకటించిన నేపథ్యంలో పత్తి రైతులు ఇబ్బందులు పడకుండ అవసరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ తో మంత్రి మాట్లాడారు. పత్తి జిన్నింగ్ మిల్లర్లతో చర్చలు జరిపి, పత్తి కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమ్మె కారణంగా పత్తిని తక్కువ ధరలకు అమ్మాల్సిన పరిస్థితి తలెత్తకూడదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

**(PN)**

---------------------------------

**Nalgonda collector**

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పై నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైస్ మిల్లర్లు, రైతులకు పలు సూచనల జారీ చేశారు. జిల్లాలోని ఏ ఒక్క రైస్ మిల్లరు మద్దతు ధరకన్నా తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకూడదన్నారు. ఎవరైనా రైస్ మిల్లర్ తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను మోసం చేసినట్లయితే

రైస్ మిల్లును సీజ్ చేస్తామన్నారు. మార్కెటింగ్, ఫుడ్ సేఫ్టీ, పొల్యూషన్, విద్యుత్ లైసెన్స్ లను కూడా రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర, బోనస్ ను పొందాలని విజ్ఞప్తి చేశారు.

**(PTC)**

------------------------

**Chief Justice**

భారతదేశ 51 వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రోజు ఉదయం రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయించారు. వచ్చే ఏడాది మే 13 వరకు ఆయన సీజేఐగా బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా, రాష్ట్రపతి భవన్ లో జరిగిన సీజేఐ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు.

**(DESK)**

----------------------------------------

**Ravindra Bharati - cm**

దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హజరయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్

అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ అధ్యక్షులు ఫహీముద్దీన్ ఖురేషీ, తెలంగాణ ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ అహ్మద్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, ఇతర నేతలు, ఉన్నతాధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

**(DESK)**

-------------------------

**Bhadradri kothagudem**

భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబ్దుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి వేడుకలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన వ్యక్తి, పరిపాలన దక్షకుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని అన్నారు. 11 ఏళ్ల పాటు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ దేశానికి ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు.

**(PTC)**

-----------------------------

**Sircilla -Education day**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో భారతరత్న. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా

నిర్వహించారు.  జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి  నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ తొలి విద్యా మంత్రి అబుల్ కలామ్ జయంతి రోజును స్మరించుకుంటూ జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు.  కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్  ఖిమ్యా నాయక్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**(PTC)**

------------------------------

**Komati Reddy Venkat Reddy**

అర్హులైన సినీ పరిశ్రమ కార్మికులకు హైదరాబాద్ చిత్రపురి కాలనీలో ఇళ్లు ఇప్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. చిన్న సినిమాలు తీసే వారికి థియేటర్లు ఇప్పించే బాధ్యత తనదని చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార వేడుకల్లో మంత్రి  మాట్లాడారు.  ప్రతిభావంతులైన ఆర్టిస్టులు, డైరెక్టర్లు, నిర్మాతలను  ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు.  పాన్ ఇండియా సినిమాలు తీసే సత్తా తెలంగాణ వారికీ ఉందన్నారు. లోకల్ టాలెంట్‌ను అందరూ సపోర్ట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**(DESK)**

-------------------------